క్లుప్తంగా

నేడు ఆర్.లింగదిన్నెలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

సంజామల: మండలంలోని గ్రామ సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నటు ఎంపీడీఓ నాగకుమార్ తెలిపారు. 5వ తేదీన ఆర్.లింగందిన్నె, 9న ముక్కమల్ల, 19న ఆల్వకొండ, 23న గిద్దలూరులో వైద్య శిబిరాలు ఉంటాయన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 2వ తేదీన కనాల, 6న కమల పూరి, 13న ముదిగేడు సచివాలయల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూచించారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బేతంచెర్ల: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, వారి ఉజ్వల భవిష్యత్తుకు తల్లిదండ్రులు బంగారు బాటలు వేయాలని ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. బడిబయట పిల్లలను గుర్తించే కార్యాక్రమంలో భాగంగా గురువారం మోడల్ స్కూలు ప్రిన్సిపాల్ మరియదాసు, అధ్యాపకుడు గంగుల నాగరాజు బేతంచెర్ల పట్టణంతోపాటు ముద్దవరం, సీతారామాపురం గ్రామాల్లో పర్యటించారు. పేదల విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహాన్ని ప్రజలకు వివరించారు.

కాల భైరవుడికి ప్రత్యేక పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొలిమిగుండ్ల: మండల కేంద్రం కొలిమిగుండ్లలోని కొండపై వెలసిన కాలభైరవుడి ఆలయంలో గురువారం స్వామివారి జయంతిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారిశ్రామికవేత్త పేరం బయపురెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, మహేష్ స్వామి తదితర భక్తులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణ రెడ్డి, నాయకులు నందకిషోర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి తదితర భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొలిమిగుండ్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ గంగన్న తెలిపారు. 01-04-2022 నుంచి 31-03-2023 వరకు చేపట్టిన వివిధ పనులపై గ్రామాల్లో డీఆర్పీలు చేపట్టిన విచారణ పూర్తి కావడంతో సభ ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి డ్వామా పీడీ రామచంద్రారెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు.

ప్రతి ఇంటికీ అక్షింతలు



మంత్రాక్షింతలు అందజేస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: అయోధ్యలో ఈ నెల 22వ తేదీన శ్రీరామ మందిర ప్రతిష్ఠను పురష్కరించుకుని ఫల మంత్రాక్షింతలను గురువారం పట్టణంలోని ఇంటింటికీ అందజేశారు. సమరత సేవా ఫౌండేషన్, ఆర్‌ఎస్‌ఎస్‌వీహెచ్ ఆధ్వర్యంలో గాంధీనగర్, కుమ్మరివీధి, ఎల్‌ఎంకాంపౌండ్, శ్రీరామనగర్, బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వీధి, సభాపతిరోడ్, తదితర కాలనీల్లో ఇంటింటికి వెళ్లి అక్షింతలు, ఆలయ చిత్ర పటాలను అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ నాయకులు వెంకటసుబ్బయ్య, లింగన్న, ఉసేనప్ప, మైకేల్, శ్రీనివాసులు, శోభారాణి, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు గొర్విమానుపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని గొర్విమానుపల్లెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయికృష్ణ తెలిపారు. వైద్య నిపుణులు ప్రజలకు అన్నిరకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు డోన్ విద్యార్థి

డోన్ టౌన్ : గుంటూరు జిల్లా నర్సరావుపేటలో శుక్రవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు జరిగే అండర్ 17 రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు డోన్‌కు చెందిన లోహిత్ ఎంపికయ్యారు. గతనెలలో కర్నూల్లో జరిగిన స్కూల్ గేమ్స్ పోటీల్లో లోహిత్ ప్రతిభ కనబరచడంతో ఎంపికయ్యాడని స్కూల్ ప్రిన్సిపాల్ అహ్మద్‌నవాజ్ తెలిపారు. ఈ మేరకు లోహిత్ గుంటూరు వెళ్తున్న నేపథ్యంలో సభ నిర్వహించి ఉపాధ్యాయులు అభినందనలుతెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రుబెన్, వ్యాయామోపాధ్యాయులు సురేష్, మహబూబ్‌బాషా, నజీర్‌బాషా, శివ, శ్రావణి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- అర్హులందరికీ పింఛన్ వర్తింపు
- ఇచ్చిన హామీ మేరకు రూ. 3 వేలకు పెంచిన సీఎం జగనన్న
- ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ ఛైర్మన్ చలం రెడ్డి



లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము రూ. 3 వేలు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన, నాయకులు

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ పింఛన్ వర్తింపజేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని, ఇచ్చిన హామీ మేరకు రూ. 3 వేలకు పింఛన్ సొమ్ము పెంచి మాట నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. పట్టణ పరిధిలోని శ్రీనగర్ కాలనీ షాదీఖానాలో గురువారం ఎంపీడీఓ వెంగన్న, నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో పెంఛన్ పెంపు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బుగ్గన నాగభూషణం రెడ్డి, చలం రెడ్డితోపాటు ఉర్దూ అకాడమీ డైరక్టర్ ముర్తుజావలీ, నాయకులు బాబుల్ రెడ్డి, సురేంద్రనాథ్‌రెడ్డి పెంచిన పింఛన్ రూ. 3వేలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఫలాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ మంజూరు చేసి వారికి జగనన్న అండగా నిలిచారన్నారు. గతంలో పింఛన్ మంజూరు అవ్వాలంటే లబ్ధిదారుల్లో ఒకరు మృతి చెందాలనే దుస్థితి ఉండేదని, ఇప్పుడా పరిస్థితి భిన్నంగా అర్హత ఉంటే చాలు ఎవ్వరి సిఫారసు లేకుండా మంజూరువుతుందని గుర్తు చేశారు. ఎంతమంది అర్హులు ఉన్నా మంజూరు చేస్తున్న ఏకైక సర్కార్ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, మధు, కోట్ల మధు, వైస్ ఎంపీపీలు రంగస్వామి, సుబ్బమ్మ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వర్ రెడ్డి, నాయకులు దస్తగిరి, సలీమ్, నిరంజన్, ఖాజా, యాకోబ్, శేఖర్ రెడ్డి, గూటుపల్లె, గోరుమానుకొండ సర్పంచ్‌లు వెంకటేశ్వర్లు, శ్రీరాములు, ఎంపీటీసీలు రామ చంద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ఒకటవ తేదీనే ఠంఛన్‌గా పింఛన్...

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరుకే కాదు.. లబ్ధిదారులు సైతం ఆ సొమ్ము తీసుకునేందుకు నిరీక్షించాల్సిన దుస్థితి ఉండేదని బుగ్గన నాగభూషణం రెడ్డి, చలం రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. పింఛన్ సొమ్ము తీసుకునేందుకు రోజులు తరబడి ఎదురు చూసిన సందర్భాలు కోకొల్లలన్నారు. కొందరు వృద్ధులు సొమ్మసిల్లిన సంఘటనలు లేకపోలేదన్నారు. మేము ఇచ్చినప్పుడే తీసుకొండే అనే ధోరణి ఉండేదని, తప్పని పరిస్థితుల్లో లబ్ధిదారులు వేచిచూసేవారన్నారు. అవ్వతాతల ఇబ్బందులు గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి ఒకటవ తేదీనే ఠంఛన్‌గా పింఛన్ అందజేస్తున్నారని గుర్తు చేశారు. సెలవున్నా... ఆదివారం అయినా... ప్రతి నెలా ఒకటవ తేదీన సూర్యుడు ఉదయంచక ముందే... లబ్ధిదారుల ఇళ్ల తలుపు తట్టి వలంటీర్లు నవ్వుతూ పలుకరించి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

మోడల్ నియోజకవర్గంగా డోన్....

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అంకితభావంతో డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతున్నారని వారు గుర్తు చేశారు. విద్యా, వైద్య రంగాలకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నారన్నారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని, గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా బేతంచెర్లకు ఇంటింటికీ శుద్ధమైన నీరు సంక్రాంతి పండుగ అందజేస్తామన్నారు.

పేదల అండగా సీఎం జగన్



గత ఏడాది అక్టోబర్ నెలలో నా భర్త దూదేకుల దస్తగిరి గోర్లగుట్ట వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మరణించాడు. మా కుటుంబానికి పెద్ద దిక్కు అయిన నా భర్త మరణంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో వైఎస్సార్ ప్రమాద బీమా కింద రూ. 5లక్షలు ఇచ్చారు. దీంతో మా కుటుంబానికి కొంతంత అండ లభించింది. అదేవిధంగా వైఎస్సార్ పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైంది. ఆపద సమయంలో మా కుటుంబానికి సీఎం అండాగా నిలిచారు. జగనన్న సాయం మరువం.

–వన్నూర్‌బీ, సంజీవనగర్ కాలనీ, బేతంచెర్ల పట్టణం

ఆదుకుంటున్న పింఛన్



నా భర్త రాజశేఖర్ పక్షవాతంతో బాధపడుతూ తొమ్మిదేళ్ల క్రితం మరణించాడు. అత్త సుబ్బమ్మతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఈక్రమంలో ప్రభుత్వ పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా. ఒకే రేషన్ కార్డులో అత్త, కోడలు ఉండడంతో పింఛన్ మంజూరు కాలేదు. హౌస్ హోల్డ్ స్ప్లిటింగ్ ఆప్షన్ ద్వారా కొత్త రేషన్ కార్డు రావడంతో వైఎస్సార్ కానుక కూడా మంజూరైంది. ప్రభుత్వం తోడ్పాటుతో కొడుకు బీటెక్, కుమార్తె ఇంటర్ చదువుతుంది. ప్రభుత్వ సాయం మరువం.

– వెంకటలక్షమ్మ, ఆర్ ఎస్ రంగాపురం, బేతంచెర్ల మండలం

వృద్ధులకు చేయూత



సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వృద్ధులకు చేయూతనిస్తున్నారు. అర్హులందరికీ పింఛన్ అందజేస్తున్న ప్రభుత్వ సాయం మరువం. వ్యవసాయ పనులు చేసే నాకు 60 సంవత్సరాలు పడటంతో వలంటీర్ ద్వారా రెండు నెలల క్రిందటే పింఛన్‌కు దరఖాస్తు చేసుకున్నా. అర్హత ఉంటే చాలు అన్నట్లుగా ఎవ్వరి సిఫారసు లేకుండా వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరు అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ సాయం మరువం.

– శంకర్ నాయక్, గోరుమానుకొండ తాండ, బేతంచెర్ల మండలం

రోడ్డు ప్రమాదాల నివారణపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం గీత మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం మూలగా రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుని విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పీఈటీ హర్ష, ఉపాధ్యాయులు సుబ్బారావు, రామయ్య, నాగరాజు, రామచంద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత



నగదు అందజేస్తున్న సర్పంచ్ మనోహర్

అవుకు: మండల పరిధిలోని రామవరం గ్రామానికి చెందిన పసుపల మద్దిలేటి అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ మూరబోయిన మనోహర్ మృతుని కుటుంబ సభ్యులను గురువారం పరామర్శించారు. మృతుని భార్య తిరుపాలమ్మకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10వేలను అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్, నాయకులు స్వామిదాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శోభా యాత్రను విజయవంతం చేయండి

డోన్ టౌన్ : పట్టణంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే స్వామివివేకానంద శోభా యాత్రలో యువత, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మలిశెట్టి జగన్‌మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 8.30 గంటల పట్టణంలోని ఎస్కేపీ హైస్కూల్ నుంచి కొత్త బస్టాండ్ సమీపంలోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు.

జనవరి 12 జన్మించిన వారికి గిఫ్టు అందజేస్తాం

స్వామి వివేకానందుని పుట్టిన రోజు జనవరి 12న జన్మించి 21 యేళ్లలోపు బాలబాలికలకు కానుకలు అందజేస్తున్నట్లు సేవా సమితి కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి తెలిపారు. ఈ నెల 10వ తేదీలోపు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడకి వివరాలు అందజేయాలని, 12వ తేదీ వివేకానంద విగ్రహం వద్ద స్వామి వారికి పుష్పాభిషేకం చేపించి కానుకలు అందజేస్తామన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



రేషన్ సరుకులను పంపిణీ పరిశీలిస్తున్న రబ్బానీ

బేతంచెర్ల: ప్రజలకు రేషన్ సరుకులను ఎండీయూలు నిర్దేశించిన ప్రాంతంలో సక్రమంగా పంపిణీ చేయాలని డోన్ సివిల్ సప్లై డీటీ రబ్బానీ సూచించారు. గురువారం పట్టణంలోని ఆయా కాలనీల్లో ఎండీయూలు చేస్తున్న రేషన్ సరుకుల పంపిణీని ఆయన తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నేపథ్యంలో సరుకులను సచివాలయాల సిబ్బందికి అప్పజెప్పాలని ఎండీయూలకు సూచించారు. అదేవిధంగా నిత్యావసర సరుకులు అన్నింటినీ కార్డుదారులకు అందజేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బేతంచెర్ల: మండల పరిధిలోని ముసలాయిచెర్వు గ్రామ సమీపాన ద్విచక్రవాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ లింగమయ్య వివరాల మేరకు బేతంచెర్ల పట్టణానికి చెందిన నక్క శ్రీను, నాగరాజు బైక్‌పై బుధవారం రాత్రి ముసలాయిచెర్వు గ్రామానికి పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నారు. ప్రమాదవశాత్తూ నక్క శ్రీను(44) కిందపడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య నక్క విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ లింగమయ్య గురువారం తెలిపారు.

ఈవీఎంలపై అవగాహన

బనగానపల్లె రూరల్ : స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ల(ఈవీఎం)పై గురువారం ఏఎస్‌ఓ వెంకట్రామిరెడ్డి అవగాహన కల్పించారు. ఈవీఎంలో వీవీప్యాడ్ పనిచేయు విధానం, ఓటు ఏ విధంగా వేయాలి తదితర వివరాలను ఆయన ఓటర్లకు వివరించారు.

జోరుగా క్రీడా పోటీలు

అవుకు: మండలంలో గురువారం 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు జోరుగా సాగాయి. మండల కేంద్రం అవుకు-3, కునుకుంట్ల, సుంకేసుల, చెర్లోపల్లె గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల మైదానాలలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉల్లాసంగా సాగాయి. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, షటిల్, కబడ్డీ తదితర క్రీడోల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పోటీపడ్డారు. ఆయా కార్యక్రమాల్లో నోడల్ అధికారులు తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓలు శ్రీధర్ రావు, వెంకటేశ్వర రెడ్డి, సుంకేసుల ఉపసర్పంచ్ పార్థు, నాయకుడు పురుషోత్తం నాయుడు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి

బనగానపల్లె రూరల్ : అవయదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మధుమౌనిక సూచించారు. గురువారం పలుకూరు పీహెచ్‌సీలో జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జేఎస్ఎస్ బ్రహ్మానంద ఆచారి ఆధ్వర్యంలో 'అవయవదానంపై అవగాహన కల్పిద్దాం..చైతన్యం చేద్దాం' కార్యక్రమం పోస్టర్లను డాక్టర్ మధుమౌనిక ఆవిష్కరించారు.



రూ. 21.70లక్షలతో నిర్మించిన హెల్త్ సెంటర్



రూ.21.50లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం

ప్రభుత్వ భవనాలు ముస్తాబు

- రేపు ప్రారంభించనున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : మండలంలోని నందివర్గం గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు ప్రారంభోత్సవానికి ముస్తాబయ్యాయి. రూ.21.70లక్షలతో హెల్త్ సెంటర్, రూ.21. 50లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ భవనాలతో పాటు రూ.50లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రారంభిస్తారని సర్పంచ్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యుడు నారాయణ తెలిపారు. అభివృద్ధి పనులు ప్రారంభోత్సవ కార్యక్రమాలకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ



కోవెలకుంట్లలో మిద్దె భాగ్యమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మీనాకుమారి



డోన్ : కొత్త లబ్ధిదారురాలికి ఫించన్ అందిస్తున్న కౌన్సిలర్ టీఈ లక్ష్మీదేవి

కోవెలకుంట్ల: మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో జనవరి నెల పింఛన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది. 17 గ్రామ సచివాలయాలకు సంబంధించి 6,119 మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ, చేనేత, డప్పు, చర్మకళాకారుల ఫించన్లు ఉన్నాయి. ప్రభుత్వం ఈ నెల నుంచి పింఛన్ మొత్తాన్ని 2,750 నుంచి రూ. 3 వేలకు పెంచింది. పాత పింఛనన్లతోపాటు 85 మందికి కొత్తగా మంజూరయ్యాయి. ఆయా గ్రామాల వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తున్నారు. గురువారం నాటికి 5,698 మందికి అందజేసి 93శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సయ్యదు న్నీసా తెలిపారు. ఈ నెల 8వ తేదీ వరకు ఫించన్ల పంపిణీకి గడువు ఉందని తెలిపారు.

పేదల పాలిట పెన్నిధి వైఎస్ జగన్

డోన్ టౌన్ : పేదల పాలిట పెన్నిధి మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3వేలకు పెంచి అండగా నిలిచారని కౌన్సిలర్లు టీఈ లక్ష్మీదేవి, సుకన్య తెలిపారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధిలో గురువారం పింఛన్ కొత్తగా మంజూరైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు పెంచిన రూ.3వేలను కౌన్సిలర్లు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు దేవా, శ్యామ్, ఉషా, వలంటీర్లు పాల్గొన్నారు.

పింఛన్ అందజేత

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో గురువారం పింఛన్ పంపిణీ సాగింది. మాజీ జెడ్పీటీసీ, మండల వైస్ ఎంపీపీ చిన్న బాబు సచివాలయంలో లబ్ధిదారులకు రూ.3 వేలు పింఛన్ సొమ్మును అందజేశారు. ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసే సీఎం జగనన్నకు అండగా నిలువాలని ఈ సందర్భంగా ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు.

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం

డోన్ : ఇచ్చిన మాటకు కట్టుబడి వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.3వేల పింఛన్ మొత్తాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందని పార్టీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్ అన్నారు. పట్టణంలోని 13వ వార్డు శ్రీరాంనగర్‌లో కౌన్సిలర్లు శరత్‌బాబు, మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం 10 మంది లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన పింఛన్ మొత్తాన్ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు శ్రీను, దస్తగిరమ్మ, నాయకులు రాజు, నాగేంద్ర, మహేష్, రమేష్, వాలెంటీర్లు బాలు, సనత్, రమేష్‌లు తదితరులు పాల్గొన్నారు.



పేరుసోముల : లబ్ధిదారునికి పింఛన్ అందజేస్తున్న వైఎస్ ఎంపీపీ చిన్నబాబు



డోన్ : శ్రీరాంనగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసిన పోస్టుపసాద్

రేపు ఎమ్మెల్యే కాటసాని రాక

అవుకు: మండల కేంద్రం అవుకునకు శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి రానున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్ రెడ్డి తెలిపారు. పింఛన్ పెంపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై లబ్ధిదారులకు రూ. 3 వేల పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకలు, కార్యకర్తలు, వలంటీర్లు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఇబ్బంది కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోండి



డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న రాజేష్

డోన్ : ప్రజలకు ఇబ్బంది కలుగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీ శ్రీనివాసరెడ్డిని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ కోరారు. మున్సిపల్ కార్మికుల సమ్మె ప్రజలను ఇబ్బంది పెట్టేరీతిలో చట్టవిరుద్ధంగా సాగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టిన నేపథ్యంలో కొందరు వీధి లైట్లుకు సంబంధించిన వైర్లు కత్తిరించడం ద్వారా పట్టణంలో అంధకారం నెలకొందని గురువారం డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి చైర్మన్ ఫిర్యాదు చేశారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా మంచినీటిని ప్రజలకు అందించేందుకు వెళ్తుంటే అడ్డగించి కొందరు మున్సిపల్ కార్మికులు దాడులకు పాల్పడుతున్నారని డీఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదులో చైర్మన్ పేర్కొన్నారు. శాంతియుతంగా సమ్మెలో పాల్గొనాలని, ప్రజలకు ఇబ్బంది కలిగించడం సమంజసం కాదన్నారు. అత్యవసర సర్వీసులైన మంచినీటి సరఫరాను అడ్డుకునే వారిపై చర్యలు తీసుకోవాలని డీఎస్పీని చైర్మన్ కోరారు. చైర్మన్ వెంట కమిషనర వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈ సురేష్‌లు ఉన్నారు.

నేటి నుంచి భూ రీసర్వేపై గ్రామ సభలు

బనగానపల్లె రూరల్ : మండలంలో శుక్రవారం నుంచి రెండవ విడత భూ సర్వే జరిగిన గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. రెండవ విడత భూ రీసర్వే జరిగిన మీరాపురం, బత్తులూరు పాడు, మిట్టపల్లె, సంకలాపురం, పండ్లాపురం, జిల్లెల్ల, నిలువుగండ్ల, జంబులదిన్నె గ్రామాల ప్రజలు ఈ సభలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శుక్రవారం ఉదయం మీరాపురం, మధ్యాహ్నం బత్తులూరుపాడు, 6వ తేదీ ఉదయం మిట్టపల్లె, మధ్యాహ్నం సంకలాపురం, 8వ తేదీ ఉదయం పండ్లాపురం, మధ్యాహ్నం జిల్లెల్ల, 9వ తేదీ ఉదయం నిలువుగండ్ల, మధ్యాహ్నం జంబుల దిన్నెలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న సుమిత్ర రాజేష్

డోన్: ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తూ ప్రోత్సహిస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్ఆర్ ఉద్యానవన యూనివర్సిటీ సభ్యురాలు సప్తశైల సుమిత్ర రాజేష్, సైంటిస్ట్ డాక్టర్ క్రాంతిశ్రీ తెలిపారు. స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో గురువారం ఇన్నర్‌విల్ క్లబ్ ఆధ్వర్యంలో ఉద్యానవన పంటల పెరటి సాగుపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ వారు చిక్కుడు, గోరుచిక్కుడు, బెండకాయ, బీర, సొరకాయ, కాకరకాయ, పాలకూర, తోటకూర, గోంగూర సాగు ప్రయోజనాలను వివరించారు. పెరటిసాగు విత్తనాల ప్యాకెట్లను సుమిత్ర రాజేష్ మహిళలకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఇన్నర్‌విల్‌క్లబ్ అధ్యక్షురాలు శాలిని, సభ్యురాళ్లు రాజా సుజాత, సరోజమ్మ, ముడియాల శైలజ, పద్మ, విమలమ్మ, శారద, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

అంధుల పాలిట దేవుడు బ్రెయిలీ



బ్రెయిలీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : బ్రెయిలీ లిపీ సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ అంధుల పాలిట దేవుడుగా నిలిచాడని హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఆయన జయంతి సందర్భంగా పాతపేట హైస్కూల్లో గురువారం ఆయన చిత్ర పటానికి హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు శివప్రసాద్, సుబ్బారెడ్డి, రవిశేఖర్, మధుసూదనరెడ్డి, సుభాన్, శ్రీనివాసులు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం లూయిస్ బ్రెయిలీ జీవిత చరిత్ర వివరిచారు. బ్రెయిలీ లిపీ నేటి తరంలో సంగీతానికి, ఓటు హక్కుకు ఏలా ఉపయోగపడుతుందో వివరించారు. అదేవిధంగా సామాజిక కార్యకర్త మమ్మద్‌రఫీ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ, భౌతికశాస్త్రవేత్త సర్ ఐజక్ న్యూటన్‌ల జయంతిని పురష్కరించుకొని వారి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

డాక్టర్ చాణక్య సేవలు అభినందనీయం



డాక్టర్ చాణక్య నాయక్‌తో డాక్టర్ల బృందం

అవుకు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఒప్పంద వైద్యుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ చాణక్య నాయక్‌కు పలుకూరు పీహెచ్‌సీలో సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా రెగ్యులర్ పోస్ట్ వచ్చింది. ఈ నేపథ్యంలో ఆయనను సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ అభినయ్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్లు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. పేదలకు అంకితభావంతో వైద్య సేవలు అందజేసిన డాక్టర్ చాణక్య నాయక్‌ను ఈ సందర్భంగా సూపరింటెండెంట్ అభినందించారు. కార్యక్రమంలో అనస్థీషియా, పిడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, డెంటల్, జనరల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్లు రవికుమార్, కళ్యాణ్ శ్రీనివాస్, జయరాముడు, రవికుమార్, ఇందిరాకళ్యాణి, యమునా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.